ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
మంగళవారం 5 నవంబరు 2024



దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ108సంస్థలో ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాలభర్తీకి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సతీష్ తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. బీఎస్సీ బీజడ్‌సీ, బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఏఎన్ఎం, ఏఎన్ఎం కోర్సులు పూర్తిచేసి 30 సంవత్సరాల వయస్సులోపు ఉన్నవారుఅర్హులన్నారు. ఆసక్తిగలఅభ్యర్థులు ఈనెల7న కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వఆసుపత్రిలోని 108కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.పూర్తివివరాలకు9154269804కు సంప్రదించాలన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి


హెచ్ఎంను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీవో

వాంకిడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఆమె ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని హెచ్ఎం శ్రీనివాస్‌ను అడిగితెలుసుకున్నారు. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు పెరుగన్నంతోపాటు రాగిజావా, వేడివేడి ఆహార పదార్థాలు పెట్టాలని సూచించారు. విద్యార్థినుల పెట్టెలను, బ్యాగులను పరిశీలించి ఇంటినుంచి తీసుకువచ్చిన ఏదైనా తినుబండారాలు ఉంటే తీసేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంటగదిలో అపరిశుభ్రత లోపించకుండా చూడాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ సకాలంలో వైద్యం అందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు.

ముగిసిన సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు

● గెలుపొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు


విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ, అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల పాఠశాలలో మూడురోజులుగా పీడీ సదానందం జ్ఞాపకార్థం జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. మహబూబ్‌నగర్ జట్టుకు, ఆదిలాబాద్‌జట్టు ఫైనల్‌లో తలపడగా ఆదిలాబాద్‌జట్టు విజయం సాధించింది. విజేతలకు బహుమతులను పట్టణ సీఐ రవీందర్, రాష్ట్రహ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, హ్యాండ్‌బాల్ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, మాజీఎంపీపీ మల్లికార్జున్, క్రీడాధికారి మీనారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, హెచ్ఎం జంగు, నాయకులు చరణ్, శ్యాం, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు


పీసీసీ అధ్యక్షుడితో నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని పార్టీకార్యాలయంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, జిల్లాఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు గోపాల్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు ఖలీం ఉన్నారు.

ఏడీఏ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు

కాగజ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఏ) కార్యాలయం ఎదుట సోమవారం దహెగాంకు చెందిన రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ దహెగాం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించిన పంట నష్ట పరిహారం విషయంలో పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. కనీసం సర్వేలు చేపట్టకుండానే ఎలా నివేదికలు పంపిస్తారని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని పేర్కొన్నారు. పంటలకు నష్టం అపారంగా జరిగినప్పటికీ, ప్రభుత్వం సహాయం తక్కువగా వచ్చినట్టు పేర్కొన్నారు. రీసర్వే చేస్తామని ఏడీఏ తెలుపటంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, వ్యవసాయా అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ..

చింతలమానేపల్లి: ఈ వర్షాకాలం జూలై, ఆగస్టులో వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని మండలంలోని దిందా, చిత్రామ, కేతిని గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుటధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత శాఖాధికారులు ఓ ప్రైవేటువ్యక్తిని గ్రామంలో పెట్టి వారి ఇష్టానుసారంగా పేర్లను రాసి ప్రభుత్వానికి నివేదిక అందించారని అన్నారు. దీంతో పంట నష్టపోయిన రైతులకు ఎలాంటి పరిహారం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రీసర్వే చేసి నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అంద జేశారు. తమకు న్యాయం జరగకపోతే కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రెవెన్యూ కార్యాలయ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మడావి శాంతాబాయి, వెంకటేశ్వర్లు, రంగయ్య, మారేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సిబ్బంది సస్పెన్షన్‌కు తీర్మానం ఆమోదం

బెజ్జూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న పాత కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, ప్రస్తుతకార్యదర్శి పర్వ సంజీవ్, డాటా ఆపరేటర్ మహేష్‌ను సస్పెండ్ చేస్తూ పాలకవర్గం సోమవారం ఏకగ్రీవంగా తీర్మాణించింది. ఈ మేరకు సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో తీర్మాణం ఆమోదిస్తూ జిల్లా సహకార అధికారికి కాపీని పంపుతున్నట్లు పేర్కొన్నారు. సొసైటీలో జరిగిన అక్రమాలపై ఇటీవల జిల్లా సహకారాధికారి బిక్కురాథోడ్ ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేయాలని పీఏసీఎస్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాలతో వారిని సస్పెండ్ చేస్తూతీర్మాణించారు. కార్యాలయంలో సీనియర్‌స్టాఫ్ అసిస్టెంట్ సత్యనారాయణ గౌడ్‌కు కార్యదర్శి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ తీర్మాణించారు. అలాగే వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి తీర్మాణించారు. కార్యక్రమంలో చైర్మన్ ఓం ప్రకాష్, డైరెక్టర్లు, తదితరులు ఉన్నారు.

లోడ్ లారీలను వెంటనే నిలిపేయాలి

● లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబు డిమాండ్

కాగజ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంకు వస్తున్న ముడిసరుకు లోడ్ లారీలను వెంటనే నిలిపేయాలని లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబు డిమాండు చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో అసోసియేషన్ సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీఎం మిల్లుకు వస్తున్న లోడ్ లారీలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే నివారించేందుకు గడ్డర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తమకు మద్దతు పాలక వర్గ సభ్యులు కూడా తీర్మానించినట్టు తెలిపారు. జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్‌తోపాటు కౌన్సిలరు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళనలో.. పత్తి రైతు



పత్తి సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. పత్తి ఏరివేతకు చేలు సిద్ధంగా ఉండగా ఇప్పటివరకు ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కూలీల కొరత కూడా తీవ్రంగా వేధి స్తోంది. మరోవైపు ఎక్కడ వర్షాలు కురిసి పత్తి ఏరడానికి వీలు కాకుండా పోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

◆ వాంకిడి

నాలుగేళ్ల క్రితం వరకు పత్తి ఎకరానికి 10నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఆ తర్వాత 8నుంచి10 క్వింటాళ్ల వరకు పరిమితమవగా రెండేళ్ల నుంచి 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఈ ఏడాది అధిక వర్షా లతో పత్తిదెబ్బతిని 5క్వింటాళ్ల లోపే దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు, తెగుళ్లకారణంగా దిగు బడులు గణనీయంగా తగ్గాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు పెట్టుబడులు ఆకాశాన్ని తాకగా, దిగుబడులు నేలచూపు చూస్తున్నాయని పేర్కొంటున్నారు.

● కూలీలు దొరక్క కష్టాలు

వర్షాలు, చీడపీడలను ఎదుర్కొని పత్తి పండించిన రైతుకు ఏరివేత కష్టాలు మొదలయ్యాయి. కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏరిన పత్తిని అమ్ముదామంటే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించ లేదు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ధర తగ్గించడంతో పెట్టు బడులు కూడా రావడం లేదని రైతులు దిగాలు చెందుతు న్నారు. పత్తి ఏరివేతకు కిలోకు రూ.10నుంచి12 ఇస్తేనే వస్తామని కూలీలు స్పష్టం చేస్తున్నారు. పైగా కూలీలను తీసుకెళ్లేందుకు ఆటో, మధ్యాహ్నం శీతల పానీయాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇతర గ్రామాల నుంచి వచ్చిన కూలీలకు ఉండడానికి వసతి ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. అందరూ ఒకేసారి పత్తి ఏరుతుండడంతో కూలీల కొరత ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు.

● ధర తగ్గించి కొనుగోలు..

ఎక్కువ కూలీ చెల్లించి పత్తి సేకరించినా సీసీఐ కొనుగోలు ప్రారంభించకపోవడంతో రైతులకు అమ్మకం కష్టాలు మొదల య్యాయి.

తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు

● కూలీలు దొరక్క ఏరివేత కష్టాలు

● అకాల వర్షాల భయం

ప్రభుత్వం ఈ సారి పత్తికి క్వింటాకు మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తామని ప్రకటించింది. సీసీఐ కొనుగోలు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ.6,200కు కొనుగోలు చేస్తున్నారు. దిక్కు తోచని స్థితిలో రైతులు ప్రైవేట్ వ్యాపారస్థులకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాక తేమ, నాణ్యత లేదని కోతలు విధిస్తూ తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టాలే మిగులుతున్నాయి

- గుర్నులే మెంగాజీ, రైతు, కోమటిగూడ



నేను 12ఎకరాల్లో పత్తి సాగుచేశాను. ఎకరాకు రూ.35 నుంచి రూ.40వేల దాక ఖర్చయింది. దిగుబడి ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లే వచ్చింది. ఈ ఏడాది అధికవర్షాలు, ఆకుముడత, లద్దె పురుగుతో పత్తిపంట దెబ్బతింది. పత్తి ఏరివేతకు కూలీలు కొరతఏర్పడింది. కిలోకు రూ.10 ఇస్తా మన్నా కూలీలు దొరకలేదు. ఇటు వ్యాపారులు క్వింటాకు మద్దతు ధరకంటే తక్కువగా కొంటున్నారు. ఈసారి రైతులకు ఏమీ మిగిలే పరిస్థితులు లేవు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిస్తే రైతులకు కొంత ఊరట లభిస్తుంది.

సమగ్ర కుటుంబ సర్వేను సమన్వయంతో పూర్తిచేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్ దోత్రే, కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఈనెల6నుంచి ప్రారంభమయ్యే సర్వేపై మండలప్రత్యేకాధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లు, పంచాయతీ ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు సర్వేనిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి విజయవంతం చేయాలని తెలిపారు.

సమగ్ర సర్వే పక్కాగా చేయాలి: సబ్ కలెక్టర్

కాగజ్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా చేయాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఎన్యుమరేటర్లకు సర్వే బ్లాక్‌లు కేటాయించామన్నారు. తమకు కేటాయించిన ఇండ్లను సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, కమిషనర్ అంజయ్య, ఎంపీడీవో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

చింతలమానేపల్లి/బెజ్జూరు/వాంకిడి/కెరమెరి/లింగాపూర్/సిర్పూర్(టి)/దహెగాం/రెబ్బెన, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులు అన్నారు. మండల కేంద్రాల్లో సర్వే విధానంపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈసర్వేను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సర్వేలో భాగంగా 75అంశాలు పొందుపర్చారని ఎన్యుమరేటర్లు అన్ని అంశాలను పూర్తిగా నమోదు చేయాలన్నారు.

మండల సమాఖ్య కార్యాలయం ఎదుట ధర్నా

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని సోమవారం వీవోఏలు పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసవేతనం రూ.20వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. అనంతరం ఏపీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

బెజ్జూరు/లింగాపూర్: హామీలు నెరవేర్చాలని కోరుతూ సోమవారం ఏపీఎం మోహన్‌లాల్‌కు మండల కేంద్రంలోని దివ్యజ్యోతి మండలసమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న వీవోఏలు వినతిపత్రం అందజేశారు. లింగాపూర్‌లో వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు సలాం హనూమంత్‌రావు అన్నారు.

న్యాస్‌పై అవగాహన

పెంచికలపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు యాదగిరి సోమవారం ఉపాధ్యాయులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సర్వేలో చేపట్టాలని వివరాలపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీ రాజ్‌కమలాకర్‌రెడ్డి, సీఆర్పీలు శ్రీనివాస్, శ్యాంసుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని 92 ఉన్నత పాఠశాలలు, 26యూపీఎస్‌లలో వారానికి మూడు కరాటే శిక్షణ తరగతుల చొప్పున మూడునెలల పాటు బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికేట్ కలిగి ఉన్న కరాటే మాస్టర్‌లు ఈనెల 6నుంచి 8లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల వారీగా నోటీసుబోర్డుపై జాబితా ప్రదర్శించామని వాటికి అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్వ అనుభవం, ప్రతిభఆధారంగా ఎంపిక చేస్తామని, మహిళా కరాటే మాస్టర్లకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

నేడు జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి బాలికల నెట్‌బాల్ ఎంపికపోటీలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ మహేశ్వర్, ఆర్గనైజర్ హరీష్‌యోగి తెలిపారు. ఎంపిక పోటీలకు అర్హులైన ఆసక్తిగల క్రీడాకారుల హాజరు కావాలని కోరారు. ఈనెల 8నుంచి 10వరకు నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాస్థాయిలో ఎంపికైన జట్టు పాల్గొంటుందని పేర్కొన్నారు.

పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

కెరమెరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం గ్రామంలో ఆదివారం రైతు గోపాల్‌కు చెందిన రెండు ఎకరాలు, నారాయణకు చెందిన ఒక ఎకరం పత్తి చేన్లను అడవి పందులు ధ్వంసంచేశాయి. దీంతో చేతి కందిన పంట నేలపాలైందని రైతులు కన్నీరు మున్నీరయ్యారు. అధికారులు తమను ఆదుకోవాలని రైతులు వేడ్కొంటున్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆసిఫాబాద్‌కు చెందిన రైతులు రవి, విలాస్, ప్రణయ్, శ్రీకాంత్, నరేష్ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని కోరారు. లింగాపూర్ మండలం పిట్టగూడకు చెందిన ధర్మాబాయి తన భర్త పేరిట ఆర్వోఆర్ పట్టాభూమి ఉందని, ఆయన మరణించారని, పట్టాభూమిని తనపేరిట మార్చాలని దరఖాస్తు చేసుకున్నారు. సిర్పూర్(టి)మండలం చీలపల్లికి చెందిన యాదగిరిగోపాల్ తనకు దివ్యాంగపెన్షన్ ఇప్పించాలని, తిర్యాణి మండలం చింతపల్లికిచెందిన లక్ష్మి తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని, కాగజ్‌నగర్ మండలం గన్నా రంకు చెందిన వెంటకమ్మ తనభర్త పేరిట పట్టాభూమి ఉందని ఆయన మరణించారని, తన పేరిట మార్పు చేయాలని దరఖాస్తు అందజేశారు. జైనూరుమండలం కిషన్ నాయక్ తండాకు ఎందిన పవర్ వసంత్‌రావు తనకు రైతు రుణమాఫీ చేయాలని, రెబ్బెన మండలం తుంగెడకు చెందిన శివరాం బైండోవర్ కేసునుంచి తనపేరు తొలగించాలని దరఖాస్తుఅందజేశారు.తిర్యాణి మండలం ఉల్లిపిట్ట, డోర్లి గ్రామానికి ఎందిన అనుష్క డిగ్రీకళాశాల నుంచి తనటీసీ, మెమోఇప్పించాలనిఅర్జీ సమర్పించారు.

కాగజ్‌నగర్: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి ఫిర్యాదు కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభయహస్తం అమలు చేయాలి

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు దళితుల సంక్షేమంకోసం అంబేద్కర్ అభయహస్తం పేరుతో రూ.12లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి దినకర్ అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ప్రజాసంఘాలు చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం మెస్ చార్జీలు పెచిఇందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్నదానం

కాగజ్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నజ్రూల్‌నగర్10లో కాళీమాత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావు, నాయకులు నక్క మనోహర్, బీనాటీ, దాసరి నరేందర్, మారుపాకశోభన్ పాల్గొన్నారు.

ముగిసిన కోలబోడి ఉత్సవాలు

కెరమెరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా మండలంలోని గిరిజనగ్రామాల్లో కొనసాగుతున్న దండారి ఉత్సవాలు కొలంబోడి పండుగతో ముగిశాయి. ఈ సందర్భంగా రాంజీగూడ గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవాలకు మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కు హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి


హెచ్ఎం శ్రీనివాస్‌ను వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం ఆమె వాంకిడి గిరిజనబాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి, భోజనవసతి, తాగునీరు తదితర అంశాలపై హెచ్ఎం శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. మంచిర్యాల, కాగజ్‌నగర్, హైదరాబాద్, ఆసిఫాబాద్ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రత్యేకవైద్యశిబిరం ఏర్పాటుచేసి విద్యార్థినులకు వైద్యపరీక్షలుచేసి చికిత్స అందించాలన్నారు. వంటశాలలో పరిశుభ్రత లోపించకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యేవెంట మాజీజడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్‌చైర్మన్ జాబిరె పెంటయ్య, మాజీసర్పంచులు బండె తుకారాం, అయ్యూబ్,సోయం భీంరావు, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్ ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే..

కెరమెరి: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రాథోడ్ శంకర్ ఆదివారం రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని పేర్కొన్నారు. ఆమెవెంట బీఆర్ఎస్ నాయకులు సరస్వతి, మాజీఎంపీపీ మోతీరాం, మాజీ వైస్ఎంపీపీ కలాం ఉన్నారు.

రైస్ మిల్లర్లు నిబంధనలు పాటించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం ధాన్యం కొనుగోలు, అండర్ టేకింగ్, బ్యాంక్ గ్యారంటీ, బియ్యం మిల్లింగ్ అంశాలపై చర్చించారు. ఈనెల 15తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ధాన్యం మిల్లింగ్ చార్జీలు ఒక క్వింటాలు దొడ్డు రకం ధాన్యానికి 40రూపాయిలు, సన్నరకం ధాన్యానికి రూ.50 చొప్పున చెల్లిస్తామన్నారు. నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావు, ఆయాశాఖల అధికారులు, రైస్ మిల్లు యాజమానులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పండరీపూర్‌కు పాదయాత్ర



పండరీపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పండరీపూర్‌కు సోమవారం చైతన్యసంప్రదాయ సమితిఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. పట్టణంలోని బాలాజీ మహారాజ్ ఆలయంనుంచి పండరీపూర్ పాదయాత్ర వ్యవస్థాపకుడు తుకారాం మహారాజ్ జెండాఊపి పాదయాత్ర ప్రారంభించారు. అనంతరం పాదయాత్రగా వెళ్లారు. కార్యక్రమంలో సభ్యులు, భక్తులు రమేష్, తులసీరాం, వెంకట్రావుట, రాంచందర్, బాలాజీ, రవీందర్ తదితరులు ఉన్నారు.

గోయగాంకు చేరిన పాదయాత్ర

కెరమెరి: ప్రతియేటా కార్తీకమాసంలో మహారాష్ట్రలోని పండరీపూర్‌కు నిర్వహించే మహాపాదయాత్రకు భక్తులు చేపట్టిన పాదయాత్ర సోమవారం గోయగాంకు చేరుకుంది. పాదయాత్ర భక్తులకు ఆసిఫాబాద్ ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న బాపునగర్ విట్టల్ రుక్మాయి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే గోయగాం హనుమాన్ ఆలయంలో అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ శంకర్, పోశెట్టి, సోనాజీ, పాండురంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ బాల్‌బాడ్మింటన్ జట్ల ఎంపిక

రెబ్బెన, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు సోమవారం సింగరేణి పాఠశాలగ్రౌండులో నిర్వహించినట్టు ఉమ్మడిఆదిలాబాద్‌బాల్ బాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి ప్రకటించారు. వీరు ఈనెల 8నుంచి 10వరకు వరంగల్‌లో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, మహేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎం.రవి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్

కెరమెరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నసాకడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు శ్యాంరావు పటేల్ సేవాసమితి ఆధ్వర్యంలో నోటు బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ మోతీరాం, ఎస్ఈఆర్పీ శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

పోరుగడ్డ అభివృద్ధి చెందేనా?

● రూ.6కోట్లు ప్రకటించిన మంత్రి ● విడుదల కాని నిధులు ● మంత్రి హామీ అమలుకు నిరీక్షణ



పక్కా గృహాలు లేని పోరు గ్రామాలు

కెరమెరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జల్, జంగల్, జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన కుమరంభీం పోరుగడ్డ గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. మండలంలోని జోడేఘాట్‌లో గతనెల17న నిర్వహించిన భీం వర్ధంతి కార్యక్రమానికి హాజరైన శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క జోడేఘాట్ మ్యూజియంతో పాటు పర్యాటక ప్రాంతం కోసం రూ.6కోట్ల నిధులు, పోరుగడ్డలోని గ్రామాల ఆదివాసులకు 200ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. దీంతో ఆయా గ్రామాల ఆదివాసుల్లో ఆశలు చిగురించాయి. గత ప్రభుత్వం రూ.25కోట్లతో కేవలం మ్యూజియం మాత్రమే



జోడేఘాట్‌కు వెళ్లే రోడ్డు

ఏర్పాటు చేసింది. కానీ ఆయా గ్రామాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గడిచిన అర్ధ శతాబ్దానికి పైనుంచి స్థిరనివాసం ఏర్పర్చుకుని జీవితం గడుపుతున్న ఆదివాసీల జీవి తాల్లో ఎలాంటి అభివృద్ధి జాడలేదన్నది సత్యం. నాటినుంచి నేటివరకు అదే పరిస్థితుల్లో వారుకాలం వెల్లదీస్తున్నారు.

పర్యాటకానికి పెద్దపీట..

ఇప్పటికే జోడేఘాట్‌లో రూ.25కోట్లతో ఆదివాసీ మ్యూజియం, భీం స్మృతివనం, భీం నిలువెత్తు కాంస్య విగ్రహంతోపాటు జోడేఘాట్ నుంచి టోకెన్ మోవాడ వరకు 14కిలో మీటర్ల వరకు బీటీరోడ్డు నిర్మించారు. అయితే పర్యాటకులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా హోటళ్లు, మినరల్‌వాటర్ సౌకర్యం కల్పించేందుకు నిధులు కేటాయించారు. అలాగే బాబేఝరిలో దట్టమైన అడవుల మధ్య అందాల జలపాతం ఉంది. ఇక్కడ సుమారు 30ఫీట్ల ఎత్తునుంచి నీరు జాలువారుతూ చూపరులను కను విందు చేస్తుంది. కానీ ఈ ప్రాంతం వెళ్లడానికి ఎలాంటి రహదారి సౌకర్యం లేదు.

పోరుగడ్డలోని ఆ..12 గ్రామాలు ఇవే..

కుమరంభీం పోరుగడ్డలో ఉండే గ్రామాలైన జోడేఘాట్, జోడేఘాట్ కోలాంగూడ, పట్నాపూర్, లైన్‌పటార్, శివగూడ, చాల్‌బాడి, పాటగూడ, బాబేఝరి, గోండ్‌గూడ, టోకెన్‌మోవాడ్, పిట్టగూడ, కోలాంగూడ గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. జోడేఘాట్‌లో గత ప్రభుత్వం మంజూరు చేసిన 30డబుల్ బెడ్‌రూం ఇళ్ల మూడు పూర్తికాగా మిగిలిన 27గృహాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఆయాగ్రామాల్లో పూరి గుడిసెలు ఉండగా కేవలం జోడేఘాట్‌లోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కనిపిస్తున్నాయి. అవికూడా అక్కడక్కడ ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒకే డబుల్ బెడ్ రూం ఇళ్లలో రెండు మూడు కుటుంబాలు నివసిస్తున్నాయి. వెంటనే జోడేఘాట్ గ్రామాల ప్రజలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిధులు మంజూరు ఎప్పుడో..

మంత్రి సీతక్క హామీ ఇచ్చి పదిహేనురోజులకు పైగా గడుస్తున్నా ఇప్పటికీ ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. నివేదికలు సిద్ధం చేయాలని వర్ధంతి సమావేశంలో జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ తరుణంలో స్థానిక అధికారులు పలు గ్రామాల వివరాలు, వారి జీవనస్థితిగతులు, పక్కాగృహాలు, ఇతర వివరాలు సేకరించారు. కానీ ఇంతవరకు ఇందిరమ్మ గృహాల మంజూరు లాంటివి ఇంకా ఏమీ జరగలేదు.

సమాచారం సేకరిస్తున్నాం..

అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి



కుమరం భీం పోరుగడ్డ గ్రామాల కార్యదర్శులతో సమాచారాన్ని సేకరిస్తున్నాం. పూర్తివివరాలు సేకరించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎన్నిఇళ్ల అవసరమవుతాయో జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



ఆనంద్‌కుమార్(ఫైల్)



ఆనంద్‌కుమార్ తల్లిని ఓదారుస్తున్న డీఎస్పీ రామానుజం

సిర్పూర్(యు)/కాగజ్‌నగర్, నవంబరు4, (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(యు) మండలకేంద్రానికి చెందిన మడావి ఆనంద్‌కుమార్(48)సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన సివిల్ కానిస్టేబుల్‌గా కాగజ్‌నగర్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా మృతదేహాన్ని స్వగ్రామమైన సిర్పూర్(యు)కు తరలించి అధికారలాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకురాలు మరుస్కోల సరస్వతీ, పోలీసు యునియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆత్రం భగ్వంత్‌రావ్ తదితరులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం..
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీఎస్పీ రామానుజం

కానిస్టేబల్ మడావి ఆనంద్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. ఈ సందర్భంగా వారు మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జైనూర్‌సీఐ రమేష్, ఖమ్మంసీఐ రామారావ్ ఎస్ఐలు సాగర్, రామకృష్ణారావ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపనపేట గ్రామానికి చెందిన ధన్నూరి వెంకయ్య(68) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రం తెలిపారు. వెంకయ్య కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బాధ భరించలేక ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సీటు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

పెంచికలపేట, నవంబరు 4: దహెగాం మండలం ఒడ్డుగూడ గ్రామానికి చెందిన రౌతు సుజన్, జావారి అన్వేష్‌కు గురుకులంలో సీటు ఇప్పిస్తానని మండలంలోని చెడ్వాయికి చెందిన బుజాడి వెంకటేష్ ఒక్కొక్కరి నుంచి రూ.15వేల చొప్పున రూ.30 వేల నగదు వసూలు చేశాడు. ఆరు నెలలు గడుస్తున్నా సీటు ఇప్పియ్యకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని విద్యార్థి సోదరుడు రైతు శంకర్, మరో విద్యార్థి తండ్రి సంతోష్ సోమవారం పోలీసు స్టేషన్‌లో వెంకటేష్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



సీతారాం

సిర్పూర్(టి), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపల్లి గ్రామపంచాయతీలోని గొల్లవాడకు చెందిన కె సీతారాం(72) గతనెల 27న ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయాడు. అతని కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని కుమారుడు రాకేష్ సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.

విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన

మంచిర్యాల అర్బన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సోమవారం పట్టణంలోని మీమ్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు షీటీమ్ ఎస్సై హైమా అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సైబర్ క్రైమ్, పోక్సో, మహిళా చట్టాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ అమ్మాయిలను వేధింపులకు గురిచేయడం లాంటి అంశాలపై అవగాహన కలిస్తూ పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడు మహిళల భద్రత కోసం పనిచేస్తుందని, ఎలాంటి ఇబ్బందులకు గురైనా వెంటనే షీటీమ్ నెంబర్ : 6303923700 లేదా 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సతీష్, జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



మాట్లాడుతున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. సోమవారం దుగ్నేపల్లిలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశామన్నారు. రెండు లీటర్ల గుడుంబాను పట్టుకున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. తాళ్లగురిజాల ఎస్ఐ రమేష్, టూటౌన్ ఎస్ఐ మహేందర్, ఆర్ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్అండ్‌పీసీ విభాగంలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు హెల్మెట్ ధరించి విధులకు హాజరుకావాలని ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి అన్నారు. ఎస్అండ్‌పీసీ కార్యాలయం ఆవరణలో మొదటి, రెండో షిఫ్ట్ సెక్యూరిటీ గార్డులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని చెప్పారు. దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరైతే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్లు పోగుల స్వామి, రామిరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, జమ్మేదార్లు రామచందర్, దాస్, శ్రీనివాస్, కనకయ్య, నాగమల్లేష్, ఎఫ్ఎంఎస్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

మందమర్రిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి అందుగులపేట గ్రామంలో పోలీసు కళాజాత ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, సైబర్‌క్రైం, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని వాటికి బానిసాలు కావద్దని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. సైబర్ క్రైం మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మూఢనమ్మకాలు నమ్మవద్దని, అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు.

ప్రమాదాల నివారణకే శ్రమదానం

కాసిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను నివారించేందుకు గుంతలమయమైన రోడ్లపై శ్రమదానం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ అన్నారు. సోమవారం సుద్దవాగు బ్రిడ్జి నుంచి కాసిపేట వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న గుంతలతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రెండు నెలల క్రితం కాసిపేటకు చెందిన లక్ష్మణ్ స్కూటీ అదుపు తప్పి కింద పడి గాయాలై మృతిచెందాడన్నారు. ప్రమాదాల నివారణకు శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కృష్ణకాలనీలో ఆటో నడుపుతూ ఇటీవల చనిపోయిన పెనుగొండ సంపత్ కుటుంబానికి కృష్ణా కాలనీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సహాయం అందించారు. 30 వేల రూపాయల నగదుతో పాటు నిత్యావసర సరుకులు మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాగిడి రాజు, ప్రధాన కార్యదర్శి ఎండీ రహీం, గౌరవాధ్యక్షుడు కాల్వ రాజయ్య, ఉపాధ్యక్షులు ఎనగందుల వెంకటేష్, మామిడి సదానందం, కోశాధికారి బొబ్బల కుమార్, ప్రచార కార్యదర్శి వినోద్, సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్పష్టమైన వివరాలు సేకరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు స్పష్టమైన వివరాలను సేకరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి కుల ఇతర అన్ని అంశాలపై ప్రభుత్వం చేపట్టిన సర్వే సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కేటాయించిన బ్లాక్‌లోని అన్ని కుటుంబాలను నమోదు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, అధికారులు మహ్మద్ కాసీం, సత్యం పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం



కౌన్సెలింగ్‌తో ఉద్యోగులకు అవగాహన కల్పించండి

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరు అవుతున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్‌తో అవగాహన కల్పించాలని ఎస్ఓటు జీఎం సత్యనారాయణ అన్నారు. సంక్షేమాధికారులతో సోమవారం డీజీఎం(పర్సనల్) పిఅరవిందరావు సమీక్షసమావేశం నిర్వహించగా, సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు 2024 జనవరి నుంచి సెప్టెంబర్ నెల వరకు 75 కంటే తక్కువ మస్టర్లు ఉంటే వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులు క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు రాజేశ్వర్ రావు, రాజేశ్, దేవేందర్ రెడ్డి, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

కాసిపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని కాసిపేట 2వ గనిమేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం గనిలోని 92మంది బదిలీ వర్కర్‌లకు జనరల్ మజ్దూర్‌లుగా పదోన్నతిపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందిన కార్మికులందరు బాధ్యతగా పనిచేయాలన్నారు. పనిస్థలాల్లో అప్రమత్తంగా ఉంటూ రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి చేయాలన్నారు. కార్మికులు గైర్హాజరు కాకుండా బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్‌సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్, కార్మికులు పాల్గొన్నారు.

విధులకు తప్పనిసరిగా హాజరు కావాలి

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్మికులు విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని ఎస్ఆర్‌పీ3,3ఏ గని మేనేజర్ సీహెచ్ వెంకట్రావు అన్నారు. 75మస్టర్ల కంటే తక్కువహాజరు ఉన్న కార్మికులకు సమావేశమందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ, ఉద్యోగులు ఒక ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు సరైనమస్టర్లు లేనివారు ఈ విషయాన్ని గమనించాలన్నారు. మిగిలిన రెండు నెలల్లో చేసే మస్టర్లను గమనిస్తామని తెలిపారు. సరైన కారణం లేకుండా డ్యూటీకి రాకపోతే సంస్థ నియమనిబంధనల ప్రకారం చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రక్షణాధికారి మహేందర్, సంక్షేమాధికారి ఎస్ఎండీ గౌస్‌పాషా, పిట్ కార్యదర్శి మురళీచౌదరి పాల్గొన్నారు.

అబ్రహం ఆశయ సాధనే లక్ష్యం: ఏఐటీయూసీ



అబ్రహం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఏఐటీయూసీ నాయకుడు వీటీ అబ్రహం ఆశయ సాదనే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మార్కెట్ సెంటర్‌లోని అబ్రహం స్థూపంవద్ద అబ్రహం వర్ధంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సమరశీలపోరాటాల్లో అబ్రహం ముందుండేవారన్నారు. కార్యక్రమంలో నాయకులు సలేంద్రసత్యనారాయణ, భీమనాదుని సుదర్శన్, దాగం మల్లేష్, కంది శ్రీనివాస్, గాండ్లసంపత్, కొమురయ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

వీటీ అబ్రహం వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఏఐటీయూసీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని సీతారామయ్య ప్రారంభించారు. ఏఐటీయూసీ కార్యాలయం నుంచి మార్కెట్ వరకు కొనసాగింది.

కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన నాయకుడు అబ్రహం..

కార్మిక సమస్యల సాధనకోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప నాయకుడు దివంగత ఏఐటీయూసీ నేత వీటీ అబ్రహం అని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్, సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఏరియాలోని కేకే5 గనిపై, ఏరియాలోని వర్కుషాపులో వీటీ అబ్రహం 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్రహం స్ఫూర్తితో కార్మికుల హక్కులకు సమరశీల పోరాటాలు చేయాలన్నారు. ఆమహానేత చూపిన మార్గంలో పయణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్గకొండ అంజనేయులు, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, సోముశెట్టి రాజేష్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గనుల జీవితకాలం పెంపునకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల జీవితకాలం పెంపునకు కృషి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. ఏరియా నూతనజీఎంగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణను ఆయన సన్మానించి అభినందనలు తెలిపారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా పాల్గొన్నారు.

టెక్నికల్ సమస్యతోనే చందా రికవరీ

టెక్నికల్ సమస్యతోనే ఏఐటీయూసీకి టెంపుల్‌పేరిట చందా రికవరీ అయ్యిందని ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కెసమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా రికవరీ చేయాలని అనుకున్నామని, కానీ సాంకేతికసమస్యవల్ల గుడి కమిటీ (1835) కోడ్‌మీద రికవరీ అయ్యిందని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని వివరించారు.

ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏరియాలో ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని జీఎం సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తగిన ప్రణాళికలు వేసుకొని రక్షణతోకూడిన వందశాతం ఉత్పత్తిని సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు శ్రీనివాస్, ఏవీరెడ్డి, ఏజెంట్లు రాముడు, శ్రీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులుపాల్గొన్నారు.

అనుమతి లేకుండా వేతనాల నుంచి చందాలు

మందమర్రి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో కార్మికుల అనుమతి లేకుండానే వారి వేతనాల నుంచి 500రూపాయలు గుర్తింపు సంఘం నాయకులు చందాల పేరిట రికవరీ చేయడం సరికాదని ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చందాలు గుడికమిటీ పేరిట చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి యాజమాన్యం కూడా సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఈచందాలు రికవరీచేసే పద్ధతిని విరమించుకోవాలని అన్నారు. గుర్తింపు సంఘం దీనిపై జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

మందమర్రి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మందమర్రిలో కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీలకు సింగరేణి పాఠశాల మైదానం ముస్తాబైంది. ఈపోటీల్లో సింగరేణిలోని 11ఏరియాలకు సంబంధించిన జట్లు పాల్గొనున్నాయి. 5,6తేదీల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రెఫరీలుగా తెలంగాణ ఫుట్‌బాల్ రాష్ట్ర అసోసియషన్ చెందిన వారు వ్యవహరించనున్నారు. క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వారికి బస చేసేందుకు గదులను ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు సంబంధించి గెలుపొందిన జట్ల నుంచి కోల్‌ఇండియా పోటీలకు ఎంపిక చేయనున్నారు. క్రీడల ఏర్పాట్లను మందమర్రి జీఎం దేవేందర్ పర్యవేక్షించారు.

నిర్దేశిత ఉత్పత్తి సాధిస్తాం: జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సరైన ప్రణాళికతో నిర్దేశిత ఉత్పత్తి సాధిస్తామని ఏరియా జీఎం సూర్యనారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణను అమలు పరుస్తామన్నారు. గతనెలలో భూగర్భ గనులు 82శాతం ఉత్పత్తి సాధించగా, వర్షాల కారణంగా ఓసీపీలలో ఉత్పత్తి 63శాతం మాత్రమే వచ్చిందన్నారు. ఏరియాలో 5,28,500టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 3,57,521టన్నులు వెలికితీసినట్లు వివరించారు. అలాగేఏరియాలో పలు సంక్షేమకార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. కారుణ్యనియామకాలు, మహిళలకు ఉపాధి కోర్సులు అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఓటుజీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఇందారం ఓసీపీపీవో ఏవీరెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించిన జీఎం

శ్రీరాంపూర్ ఓసీపీనిఏరియా జీఎం సూర్యనారాయణ సోమవారం సందర్శించారు. ముందుగా ఆయనమైసమ్మ ఆల యంలో పూజలుచేసి, అనంతరం క్వారీలోకి వెళ్లి పనిస్థలాలను తనిఖీచేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి టి శ్రీనివాస్, మేనేజర్ బి బ్రహ్మాజీరావు, ఇంజనీర్ నాగరాజు, సంక్షే మాధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో పర్యటించిన జీఎం

రెబ్బెన, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో కార్పొ రేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్(సీపీపీ) జీఎం ఎ మనోహర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఓసీ ఉత్పత్తి తీరును బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్‌తో అడిగితెలుసుకున్నారు. ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్లేమార్గంలో వాగుపై నిర్మిస్తున్నవంతెన పనులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై చర్చించారు.

ఇందిరమ్మ ఇళ్లకు
విధి విధానాలు

(5వపేజీ తరువాయి..)

ఆధీనంలో ఉంటాయి. అవసరాన్ని బట్టి అర్హులైన వారికి వాటిని అప్పటి కప్పుడు మంజూరు చేసే వెసలుబాటు కల్పించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, స్థలాల కోసం 2,10,206 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 20న తుది జాబితా విడుదల చేయనున్నారు.

ఎంపిక బాధ్యత తహసీల్దార్లదే

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తుది నిర్ణయాన్ని ప్రభుత్వం తహసీ ల్దార్లకు అప్పగించింది. ఎంపిక ప్రక్రియ మొదట ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఉంచా లని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, వివాదం నెలకొంటుందనే ఉద్దేశ్యంతో తహ సీల్దార్లకు అప్పగించింది. ఎమ్మెల్యేల పరిధిలో ఉంటే ఆయా గ్రామాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు తమకు అనుకూలంగా ఉండే వారికి ఇళ్లు కేటాయించే అవ కాశం ఉంటుంది. దీంతో అర్హులకు ఇళ్లు అందుతాయో లేదోనన్న సందేహాలు వచ్చాయి. దీంతో తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.

రేషన్‌కార్డు తప్పనిసరి కాదు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రేషన్ కార్డు తప్పనిసరి కాదని మంత్రి స్పష్టం చేశారు. అయితే ప్రజా పాలనలో మహిళల పేరుతో వచ్చిన దరఖా స్తులను మాత్రమే పరిగణలోకి తీసుకునే అవకాశాలున్నాయి. ఇళ్ల మంజూరు వివిధ వర్గాలకు రిజర్వేషన్ దామాషాన జరుగనుంది. దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 20, ఎస్టీలకు 10, బీసీ మైనార్టీలకు 50, జనరల్ కోటాలో 15 శాతం ఇళ్లు కేటాయించనున్నారు. శిథిలావస్థలో ఇల్లు ఉండి, పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు ఇంటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు చూపాల్సి ఉంటుంది. సొంత స్థలం కలిగి ఉన్న వారికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం, లేని వారికి 75 గజాల స్థలంతో పాటు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంజూరు పత్రాలు అందిన తరువాత ఇళ్ల నిర్మాణం ప్రారంభించు కోవచ్చు. బేస్‌మెంట్ లెవల్లో రూ.లక్ష, పిల్లర్ల లెవల్లో రూ.1.25 లక్షలు, స్లాబ్ లెవల్లో రూ. 1.75 లక్షలు, నిర్మాణం పూర్తయిన తరు వాత రూ.లక్ష నగదు చెల్లించనున్నారు.

ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు అర్హులా? కాదా? అనే విషయాన్ని అధికారులు పరిశీలించి ఖరారు చేయనున్నారు. ప్రస్తుత ప్రదేశంలో ఎప్పటి నుంచి నివాసం ఉంటు న్నారు..? అనే వివరాలతోపాటు ఇంటి స్థలం ఉన్నవారైతే సదరు స్థలం సొంతమేనా? దాని స్వభావం, ఎలా సంక్రమించింది? అనే వివరాలను తీసుకోనున్నారు. ఆ తరువాతనే పథకం మంజూరు కానుంది.

ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తులు చేసుకోవాలి

జన్నారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ మృతుల కుటుంబాలు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా కోసం కలెక్టరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని గల్ఫ్ సంక్షేమ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది డిసెంబర్ 7 తర్వాత మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాల వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవా లన్నారు. వారికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి గల్ఫ్ కార్మికుల కోసం 216 జీవో తీసుకువచ్చి న్యాయం చేశారన్నారు. సమావేశంలో నాయకులు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌పై ఆసక్తి

- జిమ్ సెంటర్లకు వెళ్తున్న ప్రజలు
- జిల్లాలో వెలుస్తున్న సెంటర్లు
- దేహదారుఢ్యం కోసం యువత


బాడీ బిల్డింగ్ కోసం జిమ్‌లో కసరత్తులు చేస్తున్న యువకులు

బెల్లంపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా ప్రజల అలవాట్లు మారుతున్నాయి. శారీరక శ్రమ లేకపోవడంతో వయసుతో సంబంధం లేకుండా అధిక బరువుకు గురవుతున్నారు. అలసట, నీరసంతో పనులు చేయలేకపోతున్నారు. దీంతో దేహదారుఢ్యం కోసం అన్ని వయసుల వారు జిమ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. పోలీసు ఉద్యోగాలు తదితర వాటి కోసం యువత ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. జిమ్ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ఇందుకు అనుగుణంగా జిల్లాలో విరివిగా జిమ్ సెంటర్లు వెలుస్తున్నాయి.


ట్రైనర్ సహాయంతో షోల్డర్స్ చేస్తున్న యువకులు

ఫిట్‌నెస్ కోసం జిమ్ సెంటర్లకు..

సన్నగా ఉండేవారు తమ శరీరాకృతిని పెంచుకునేందుకు కసరత్తు చేస్తుండగా లావుగా ఉన్న వారు పొట్ట, నడుము ఇతర అవయవాల్లో పేరుకుపోయిన కొవ్వును తగ్గించుకునేందుకు జిమ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో రోజు కు ఒక గంట చొప్పున కసరత్తు చేస్తున్నారు. చలికాలంలో ఎక్కువగా వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారని జిమ్ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

జిల్లాలో వెలుస్తున్న జిమ్ సెంటర్లు

గతంలో జిమ్‌సెంటర్లు ప్రధాన పట్టణాల్లో ఒకటో రెండో ఉండేవి. ప్రస్తుతం ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించడంతో పట్టణాల్లో పదుల సంఖ్యలో ఉంటే మండల కేంద్రాల్లో రెండు నుంచి మూడు వరకు సెంటర్లు ఉంటున్నాయి. చెస్ట్, ఆర్మ్స్, షోల్డ ర్స్ ట్రైషేప్ వంటి వ్యాయామాలు చేసేందుకు జిమ్‌లలో ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. జిమ్ సెంటర్లలో అధునాతన వ్యాయామ మిషన్లు అందు బాటులో ఉంటున్నాయి. పోలీసు, ఆర్మీ వంటి ఉద్యోగాలు సాధించడానికి యువత జిమ్‌లకు వెళ్తుండగా మరి కొందరు ఫిట్‌గా ఉండడానికి, బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్నారు.





ఫిజికల్ ఫిట్‌నెస్ అవసరం

పెసరి శివకుమార్, మందమర్రి

నా వయస్సు 22 సంవత్సరాలు. నాలుగు సంవత్సరాలుగా జిమ్‌కు వెళ్తున్నాను. రోజు గంటకు పైగా వ్యాయామం చేస్తాను. ఫిట్‌గా ఉంటే పోలీసు, ఆర్మీ వంటి ఉద్యోగాలను సులువుగా సాధించవచ్చు. బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణిస్తే కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలను సులువుగా సాధించవచ్చు.



ఆరోగ్యం లేకుంటే వ్యర్థమే

:బోనగిరి నరేష్, తాండూర్

నా వయస్సు 39 సంవత్సరాలు. క్రమం తప్పకుండా జిమ్‌కు వచ్చి వ్యాయామం చేస్తాను. అధిక బరువును తగ్గించుకునేందుకు వస్తున్నాను. జిమ్ చేయడం వల్ల రోజు హుషారుగా పనులు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను.



బాడీ బిల్డింగ్ పోటీల కోసం

: మొగిలి, బెల్లంపల్లి

నా వయసు 44 సంవత్సరాలు. 20 ఏళ్లుగా బాడీ బిల్డింగ్ పోటీల కోసం జిమ్‌లో కసరత్తు చేస్తున్నా. వ్యాయామం చేయడం వల్ల ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. అనారోగ్య సమస్యలు దరి చేరడం లేదు.



చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చు

పన్నాల సదానందం , జిమ్ సెంటర్ నిర్వహకుడు, బెల్లంపల్లి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. 6 ఏండ్ల క్రితం జిమ్ ఏర్పాటు చేశాను. నిత్యం జిమ్ చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. మానసిక ఒత్తిడి దూరమవుతుంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుండడంతో యువతతోపాటు అన్ని వయస్సుల వారు జిమ్‌లో జాయిన్ అవుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు నాగుల చవితి

నస్పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దీపావళి తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చవితి రోజున 'నాగుల చవితి' నిర్వహిస్తారు. పాలను పుట్టలో పోసి నాగపూజ చేసి చలిమిడి, చిమ్మిలి, అరటి పళ్ళు మొదలైన వాటిని నివేదన చేస్తారు. పుట్టను ఆరాధిస్తే సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. సౌభాగ్యానికి, సంతానప్రాప్తికి సర్పపూజ మంచిదని పండితులు చెబుతున్నారు. మంగళవారం నాగుల చవితి పూజలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా భక్తులు సిద్ధమయ్యారు. నాగేంద్ర మేము నిన్ను ఆరాధిస్తున్నాం. పొరపాటున తోక తొక్కితే తొలగిపో... నడుం తొక్కితే నా వారనుకో... పడగ తొక్కితే కస్సుబుస్సుమని భయపెట్టకు తండ్రి అంటూ పుట్టకు ప్రదక్షిణ చేసి నైవేద్యాలు పెట్టి ప్రార్థన చేస్తారు. నాగుల చవితి రోజున పూజ చేస్తే పలు దోషాలకు నివారణ కలుగుతుందని పూజారివంశీకృష్ణశర్మ అన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల పీడీ

దండేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీడీ సూరం రవిలు తెలిపారు. ఈనెల 2న నిర్మల్ జిల్లా మస్కపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి యోగా పోటీలో అండర్-14 విభాగంలో హర్షవర్ధన్ ప్రతిభ కనబరిచారు. కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం


టీడీపీ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న సంజయ్‌కుమార్

మందమర్రిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్ తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ క్యాడర్ చెక్కు చెదరలేదన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయాలన్నారు. సంపత్, ఎండీ షరీ ఫా, విజయ, సంధ్య, సుగుణ, పాల్గొన్నారు.

కులగణనలో కురమ కులస్థులు జాగ్రత్త వహించాలి

నెన్నెల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కురుమ కులస్థులు కులగణన సమయంలో జాగ్రత్తగా ఉండాలని కురమ సంఘం జిల్లా కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జీ చిర్రం రమేష్ అన్నారు. నెన్నెలలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో అవగాహన లేక పాఠశాలల్లో కురమ విద్యార్థుల కులాన్ని గొల్ల అని రాయడంతో బీసీ-డీ సర్టిఫికెట్లు వచ్చాయన్నారు. కురమ కులస్థులు బీసీ-బీ (సీరియల్ 11)లో వస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే కుల గణనలో స్పష్టంగా కురుమలు బీసీ-బీగా చెప్పుకోవాలని సూచించారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి

మందమర్రిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): లెదర్ పార్కు స్థలం నుంచి అక్రమంగా ఓ కాంట్రాక్టర్ మట్టి తరలిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు మాదిగ దండోరా నాయకులు వినతి పత్రం అందించారు. ఆదివారం నుంచి మట్టి తరలిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. శంకర్, విజయ్‌కుమార్‌పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


బెల్లంపల్లిలో నిరసన తెలుపుతున్న మహిళలు, విద్యార్థినులు, మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రగతి శీల మహిల సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలకత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతి శీల మహిళ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కోర్టులతో బాధితురాలుకు న్యాయం జరగడం లేదన్నారు. సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ ఉన్నందున దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. అరుణ, మంగ, లక్ష్మీ, సుశీల, శ్వేత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు ముస్కె జ్యోతి అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంటా చౌరస్తా వద్ద విద్యార్థినులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. అత్యాచారాలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకురాల్లు అనిత, రాజక్క పాల్గొన్నారు.

జపాన్ సకురా సైన్స్ ఎక్ఛేంజ్ కార్యక్రమానికి విద్యార్థిని ఎంపిక


విద్యార్థినికి నగదు అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సెక్రెటరీ ఆఫ్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో జపాన్‌లో నిర్వహించే సకురా సైన్స్ ఎక్ఛేంజ్ కార్యక్రమానికి మంచిర్యాలలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యాసింగ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం అభినందించారు. కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఈవో యాదయ్యతో కలిసి విద్యార్థినికి నగదు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 16 వరకు జపాన్‌లో జరగనున్న సైన్స్ ఎక్ఛేంజ్ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థిని ప్రయాణ ఖర్చులు, వసతి అన్ని సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, విద్యార్థిని సొంత ఖర్చులకు సాదుల ప్రవీణ్‌కుమార్-వనజ దంపతులు అందజేసిన రూ.5 వేలను, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు అం దించిన రూ.2 వేలు, కస్తూర్బా ప్రత్యేకాధికారి స్వప్న అందించిన రూ.2 వేలను విద్యార్థినికి అందించినట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట

వేమనపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లెడ గ్రామంలో పంట పొలాల్లో విద్యుత్ అధికారులు సోమవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ ఏఈ దీక్షిత్ మాట్లాడుతూ రైతులు బోరు మోటార్ల వద్ద వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఆటో స్టార్లను తొలగించి కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిబ్బంది ఆకాష్, మార్కండేయ, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

బెల్లంపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సింగరేణి కళావేదిక ఎదుట నిర్మించిన అక్రమ కట్టడాన్ని సోమవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్టడాన్ని తొలగించినట్లు మున్సిపల్,రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

చెత్తను తొలగించండి

బెల్లంపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ అధికారులు తిలక్ స్టేడియంలో చెత్తను తొలగించాలని ప్రజలు, వాకర్లు కోరుతున్నారు. దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారని, అనంతరం చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయన్నారు. దీంతో వాకర్లు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే చెత్త కుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

11 నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు


మైదానాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

లక్సెట్టిపేటరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మైదానంలో ఈ నెల 11 నుంచి 14 వరకు జోనల్ స్థాయి క్రీడా పోటీలు జరగనున్నట్లు ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం క్రీడా మైదానాన్ని పరిశీలించి మాట్లాడారు. పెద్దపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన పది పాఠశాలల విద్యార్థులు సుమారు 1300 మంది పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల కోసం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

దండేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14 బాల బాలికల వాలీబాల్ టోర్నమెంట్ సెలక్షన్స్ ఈనెల 6న తాళ్ళపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు, టోర్నమెంట్ కన్వీనర్ సిరంగి సుదర్శన్, పీడీ రోజీ వరకుమారిలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఈవో యాదయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణి రాజా ఆదేశాల మేరకు ఎంపిక పోటిలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారుల జట్లు వివరాలను తాళ్ళపేట ప్రభుత్వ పాఠశాలలో తెలియజేయాలన్నారు. క్రీడాకారులు 01-01-2011 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. వయసు ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ అందజేయాలన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సహాయం


విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

జైపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముదిగుంట గ్రామానికి చెందిన పత్తి రజనీకాంత్ కుమారుడు పత్తి సాయిరాహుల్‌కు ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్టు గౌరవాధ్యక్షుడు నట్ల మహేందర్, అధ్యక్షుడు కాయం తిరుపతిలు మాట్లాడుతూ సాయిరాహుల్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా నిరుపేద కుటుంబం కావడంతో ఫీజు కట్టలేని స్థితిలో ట్రస్టును సంప్రదించాడన్నారు. దీంతో రూ. 15 వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. సభ్యులు సంపత్, అశోక్, సంపత్, సుభాష్, అశోక్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన

బెల్లంపల్లిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, నాగ్‌పూర్ జాతీయ పత్తి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివకృష్ణ ఆధ్వర్యంలో యువతకు తేనెటీగల పెంపకంపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్తమ పద్ధతుల ద్వారా పత్తి ఉత్పాదకతను పెంచేలా జిల్లా వ్యాప్తంగా 425 ఎకరాల్లో రైతు క్షేత్రాల్లో ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. తేనెటీగల పెంపకం ద్వారా లాభాలు ఉంటాయని తెలిపారు. యువత దృష్టి సారించాలన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ప్రొఫెషనల్స్ ప్రియాంక, శైలజ, అనిల్, రైతులు పాల్గన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత ఎసన్వాయి జట్టు

కోటపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎసన్వాయి గ్రామంలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో ఎసన్వాయి జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్‌లో ఎసన్వాయి - మల్లపేట జట్లు పోటీ పడగా ఎసన్వాయి జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో మల్లంపేట, తృతీయ స్థానంలో చెన్నూరు జట్టు నిలిచింది. విజేత జట్టుకు రూ. 15 వేలు, రెండవ జట్టుకు రూ. 7 వేలు, 3వ జట్టుకు రూ. 3 వేలను పంచాయతీ కార్యదర్శి తాజ్, హెచ్‌ఎం ప్రకాష్‌లు అతిథిలుగా హాజరై అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


బహుమతి అందుకుంటున్న విజేత జట్టు

కోతుల బెడద నుంచి రక్షించాలి

భీమారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు గ్రామస్థులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో కోతులు ప్రతి వాడలో వందల సంఖ్యలో సంచరిస్తున్నాయని తెలిపారు. బయటకు వస్తే దాడులు చేస్తున్నాయని, తమ దగ్గర ఉన్న వస్తువులను లాక్కుంటున్నాయన్నారు. ఇండ్ల పరిసరాల్లో ఆకుకూరలు, ఇతర చెట్లు పెడతామంటే కోతుల బెడదతో పెట్టుకోలేకపోతున్నామన్నారు. ప్రజలపై కోతులు దాడులు చేస్తున్నాయన్నారు. వెంటనే కోతల బెడద నుంచి రక్షించాలని కోరారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల జిల్లా వార్తలు



న్యూస్ బాక్స్

విధుల్లో చేరిన సబ్ రిజిస్ట్రార్



సబ్ రిజిస్ట్రార్ బి.ప్రియాంక

మంచిర్యాల అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ బి.ప్రియాంక సోమవారం విధుల్లో చేరారు. జూలై 31న జరిగిన సబ్ రిజిస్ట్రార్ల నియామకాల్లో మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్‌గా ఆమె ఆగస్టు 2వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన వెంటనే వ్యక్తిగత కారణాలతో లీవ్‌లో ఉన్నారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిలతోనే కార్యాలయ సేవలు కొనసాగాయి. ఆమె విధుల్లో చేరడంతో అన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

8న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు సైన్స్‌ఫెయిర్, జిల్లాస్థాయి యువజనోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాశాఖ అధికారి కె.రాజ్‌వీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్, సోలో ఫోక్ డ్యాన్స్, పాటలు, స్టోరీ రైటింగ్, పేయింటింగ్, హ్యాండ్ రైటింగ్, టెక్స్‌టైల్స్, అగ్రో ప్రొడక్ట్, పోయెట్రీ, సైన్స్ మేళా, సోలార్ సిస్టమ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. 15-29 సంవత్సరాలలోపు ఉన్నవారు పాల్గొనవచ్చని, వయసు ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, మెమో, జిరాక్స్ కాపీలతో రావాలని, ప్రతీ మండలం నుంచి 4 టీమ్‌లు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు రాజేష్ (బాక్సింగ్ కోచ్) 9963539234, మధు (జిల్లా సైన్స్ సెంటర్ అధికారి) 98495 50200 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు విధి విధానాలు





- రేషన్ కార్డు తప్పనిసరి కాదు
- ఈ నెల 20న లబ్ధిదారుల ఫైనల్ లిస్ట్
- భూమి ఉన్నోళ్లకు రూ. 5 లక్షలు
- లేనోళ్లకు 75 గజాల స్థలం
- మంత్రి ప్రకటనతో దరఖాస్తుదారుల్లో హర్షం

మంచిర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న నిరు పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సొంత స్థలం ఉన్నవారికి మొదట ప్రాధాన్యం ఇవ్వనుండగా, లేనివారికి 75 గజాల స్థలం ఇవ్వనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా....

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ హామీలో భాగంగానే ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విధి విధానాలను మంత్రి ప్రకటించడంతో ఇళ్ల మంజూరుకు మార్గం సుగమమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో చేసిన తప్పులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పునరావృతం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ మైన, అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో ఇంకా స్పష్టత ఇవ్వలేదు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో అప్పటి ప్రజాప్రతినిధుల జోక్యం పెరగడంతో పథకం వివాదాస్పదమైంది. దీంతో అక్కడ క్కడ కొన్ని ఇళ్లు పంపిణీకి నోచుకోగా, అధిక భాగం వృథాగా ఉన్నాయి. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ, పట్టణ సభల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి మంజూరు చేయనున్నారు.

నియోజకవర్గానికి 3500 ఇళ్లు...

జిల్లాలో ఇళ్లు లేనివారి సంఖ్య వేలల్లోనే ఉంది. 9మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలం కూడా జిల్లా పరిధిలోకే వస్తుంది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించారు. మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలతోపాటు జన్నారం మండలానికి మొత్తం సుమారు 11వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే అవకాశాలున్నాయి. వాటికి తోడు రిజర్వుడ్ కోటా కింద మరికొన్ని ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేయనుంది. కలెక్టర్‌తోపాటు ఇన్‌చార్జి మంత్రి

మిగతా 7లో..

బోరు మోటార్లకు తాళం వేసిన అధికారులు



చెన్నూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని పలు కాలనీల్లోని బోరు మోటార్లకు మున్సిపాలిటీ అధికారులు తాళాలు వేశారు. దీంతో ఇండ్లకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో తాగునీటి ఇబ్బందులను తీర్చడానికి వార్డుల్లో పలు చోట్ల పది సంవత్సరాల క్రితం బోర్లు వేశారు. బోర్లకు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి కాలనీల్లోని ఇండ్లకు పైపులైన్‌లను ఏర్పాటు చేశారు. ప్రజలు అవసరం ఉన్నప్పుడు బోర్లకు ఉన్న మోటార్లను ఆన్‌చేసి నీటిని పొందేవారు. పట్టణంలోని పలు వార్డుల్లో దాదాపు 120 బోర్లకు మోటార్లు అమర్చడం ద్వారా నీటిని పొందుతున్నారు. రెండు రోజుల క్రితం మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన మురళీకృష్ణ పబ్లిక్ బోర్లకు తాళాలు వేయాలని మున్సిపాలిటీ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీ సిబ్బంది పట్టణంలోని బోర్ల స్టాటర్ బాక్సులకు సోమవారం తాళాలు వేశారు. మున్సిపాలిటీ తీరుపట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లకు కూడా విషయం తెలియకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ద్వారా నీరు రాకపోగా బోర్లకు తాళాలు వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను సంప్రదించగా ఆయా కాలనీల వాసులు విచ్చలవిడిగా నీటిని వృథా చేస్తున్నారని, అందుకే తాళాలు వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. విద్యుత్ మోటార్లు ఆన్‌చేసి మళ్లీ ఆఫ్ చేయడం లేదని దీంతో నీరంతా నాలాల్లో వృథాగా పోతుందని, అందుకే తాళాలు వేశామని పేర్కొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ

హాజీపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సహకరించాలని డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. సోమవారం హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీచేశారు. డీసీపీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలన్నారు. డయల్ 100 ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఏసీపీ ప్రకాష్, రూరల్ సీఐ అశోక్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే దంపతులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో

దండేపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 13 నుంచి జరిగే కార్తీక పౌర్ణమి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సురేఖ దంపతులకు ఆహ్వాన పత్రికను ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది అందజేశారు, సోమవారం ఎమ్మెల్యే నివాసంలో వారిని కలిసి సత్యదేవున్ని చిత్రపటాన్ని అందజేసి స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు, ఆహ్వాన పత్రిక అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక వ్రతాలు

దండేపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు కుటుంబసమేతంగా వచ్చి ఆలయ సమీపంలోని గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ధ్వజస్తంభం, రావిచెట్టు, ప్రధానాలయం ఎదుట మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు



విశ్వనాథ ఆలయంలో భక్తుల పూజలు

గర్మిళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో సోమవారం కార్తీకమాసం సందర్భంగా శివాలయంలోని మహా శివునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పరమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించి బిల్వదళాలు, పూలు సమర్పించారు. భక్తులు సతీసమేతంగా పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి

దండేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి సూచించారు. వెల్గనూర్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండ క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం వారి ప్రతిభను పరిశీలించి దిశా నిర్దేశం చేశారు. విద్యార్థుల హాజరుపట్టిక, ఉపాధ్యాయుల విద్యాబోధన తీరును పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ

దండేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల ఆదివాసి నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మారినేని రాజేశ్వరీలు పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా సాదం బాపు. అధ్యక్షుడిగా ఏదుల రమేష్, ఉపాధ్యక్షులుగా మైనేని కిష్టయ్య, మద్దికుంట ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా తత్రు అర్జున్, సంస్కృతిక కార్యదర్శులుగా సాదం జాడి, కల్లెడ నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా ముడితే రమేష్, మద్దికుంట బాపు, సహాయ కార్యదర్శిగా ముడితే ఎల్లయ్య, సలహాదారులుగా వెంకటి, మహిళ కార్యదర్శులుగా కస్తూరి పద్మ, మారపు పద్మలను నియమించామన్నారు.

ఫిట్‌నెస్‌పై ఆసక్తి

- జిమ్ సెంటర్లకు వెళ్తున్న ప్రజలు
- జిల్లాలో వెలుస్తున్న సెంటర్లు
- దేహదారుఢ్య పరీక్షల కోసం యువత



ట్రైనర్ సహాయంతో ఫ్లోట్స్ చేస్తున్న యువత

7

పోరుగడ్డ అభివృద్ధి చెందేనా..?

- రూ.6కోట్లు ప్రకటించిన మంత్రి
- విడుదల కాని నిధులు
- మంత్రి హామీ అమలుకు నిరీక్షణ



జోడేఘాట్‌కు వెళ్లే రోడ్డు

6

ముఖ్యమంత్రిని కలిసిన కేజీబీవీ విద్యార్థులు

మంచిర్యాల, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు సోమవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. సీఎం మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయగా తమ ప్రభుత్వం విద్యారంగ పురోగతికి కట్టుబడి ఉందన్నారు.

పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించామని, ఉపాధ్యాయుల బదిలీలు వివాదం లేకుండా జరిపామని, పదోన్నతులు కల్పించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐటీ ఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ప్రమాదకరమని, వాటి బారిన పడవద్దని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులకు చదువు, సామాజిక స్పృహ ఉండాలని, చదువుకు న్న వారు ప్రయోజకులు అవుతారని సీఎం అన్నారు. సామాజిక స్పృహతో సమాజానికి సేవ చేసే వారు హీరోలు అవుతారని, ఉన్నత చదవులు చదువుకొని తెలంగాణ పునర్ని ర్మాణంలో భాగసామ్యం కావాలని సీఎం సూచించారు. ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచినందుకు ముఖ్యమంత్రికి విద్యార్థు లు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య మంత్రిని కలిసిన వారిలో డీసీసీ అధ్యక్షు రాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎం

వైద్య వృత్తి ఎంతో విలువైంది



వైద్య కళాశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తి ఎంతో విలువైందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ దావూద్ సులేమాన్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలో 3వ బ్యాచ్ కొనసాగుతుందని, వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కళాశాల విద్య పూర్తి చేసుకున్న తర్వాత మెడికల్ సైన్స్ కౌన్సిల్‌లో వివరాలు నమోదు చేసుకుని వైద్యులుగా బయటకు వెళ్తారని, ప్రాక్టీస్ చేసి ప్రజలకు వైద్య సేవలందించి వారి జీవితాలను కాపాడుతారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో అన్ని సౌకర్యాలతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య విద్యలో విద్యార్థులకు ఒత్తిడి ఉంటుందని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి పిల్లలతో స్నేహ పూర్వకంగా ఉండాలని సూచించారు. అధికారులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలి

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జీవో నెంబరు 27 ప్రకారం 33 రకాల ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ వర్తిస్తుం దని, సన్నరకం, దొడ్డు రకం వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలో పత్తి కొనుగోలుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 నిర్ణయించామన్నారు. సహకార అధికారి సంజీవరెడ్డి, మార్కెటింగ్ అధికారి షాబొద్దీన్, పౌరసరఫ రాల మేనేజర్ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకొంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి అర్జీదారుల నుంచి దర ఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, బెల్లంపల్లి, దండేపల్లి, జన్నారం, జైపూర్ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామన్నారు.

గుండా మల్లేష్ పేరు పెట్టాలి

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ పేరు పెట్టాలని ప్రజావాణిలో సీపీఐ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. బెల్లంపల్లి ప్రాంతానికి దివంగత గుండా మల్లేష్‌గా ఎన్నో సేవలందించారని, కూరగాయల మార్కెట్ వ్యాపారుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కాకా వెంకటస్వామి పేరును రద్దు చేసి మల్లేష్ పేరును మార్కెట్ భవనానికి పెట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీ ఐయూ నాయకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. బెల్లంపల్లి సింగరేణి కళా వేదిక ప్రాంతంలో స్థలాన్ని ఆక్రమించి కబ్జాదారులు షెటర్లు ఏర్పాటు చేశారని, వెంటనే కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, సింగరేణి భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవ డం లేదని కలెక్టర్‌కు విన్నవించారు.

కాసిపేట (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక దరఖాస్తు వచ్చిందని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తెలిపారు. మల్కేపల్లికి చెందిన కోడూరి భద్రయ్య ఆర్‌వోఎఫ్ఆర్ భూమ పట్టా కోసం దరఖాస్తులు ఇచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ బోజన్న, ఎంపీవో సప్దర్ ఆలీ, ఏపీవో నవీన్, వ్యవసాయాధికారి ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్